నాటక ప్రదర్శన కరపత్రాల ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్కార భారతి బాధ్యులు

సుభాష్‌నగర్, మార్చి 25: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27 గురువారం సాయంత్రం 6:30 గంటలకు స్థానిక రాజీవ్‌గాంధీ అడిటోరియంలో సంస్కార భారతి, ట్రస్మా, తన్మయి ఆర్ట్స్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసురబేగం, చదువు నాటికలను ప్రదర్శించనున్నట్లు సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి చామకూర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మాతృ సంస్థలో నాటకాలకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు.

న్యాయవాది మృతికి సంతాపం

వినాయక్‌నగర్, మార్చి 25: రంగారెడ్డి బార్ అసోసియేషన్ న్యాయవాది ఎర్రబాపు మృతికి నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంతాపం ప్రకటించారు. విధులకు దూరంగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ మాట్లాడుతూ.. న్యాయవాది హత్యపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. న్యాయవాదుల కోసం చట్టాన్ని రూపొందించి, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు మంథెని రాజేందర్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గుండారం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

సారంగాపూర్, మార్చి 25: మండలంలోని గుండారం ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అమర్‌నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆంగ్లంతోపాటు జీవన విలువలు నేర్పించడం అభినందనీయమన్నారు. దేశ్‌పాండే ఫౌండేషన్ స్కిల్ ఇన్ విలేజ్ కార్యక్రమాన్ని ఆరేండ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పూజను గ్రామస్తులు అభినందించారు. సంస్థ ప్రతినిధులు భానుప్రసాద్, రూప, మౌనిక, సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాష్‌రూమ్స్ ప్రారంభం

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

సిరికొండ, మార్చి 25: మండలంలోని కొండూర్ జడ్పీహెచ్ఎస్‌లో రూ.ఐదు లక్షలతో నిర్మించిన వాష్ రూమ్స్‌ను మంగళవారం ప్రారంభించారు. బ్లూ యాండర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ హ్యూమన్ వాల్యూస్ ద్వారా నిర్మించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మనీష్, వర్క్ కో-ఆర్డినేటర్ అన్న మహేశ్, మగ్గిడి నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు

సుభాష్‌నగర్, మార్చి 25: భద్రచల సీతారాముల కల్యాణానికి ఇందూరు మహిళలు తయారుచేసిన గోటి తలంబ్రాలను వినియోగించనున్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి జైర్‌కోర్ట్ హనుమాన్ మందిరంలో మహిళలు మంగళవారం వడ్లను ఒలిచి గోటి తలంబ్రాలను తయారుచేశారు. గజ్వేల్ శ్రీరామ కోటి భక్త సమాజం ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా మహిళా భక్తులు తయారుచేసిన గోటి తలంబ్రాలను వినియోగిస్తామని సంస్థ అధ్యక్షుడు రామకోటి రామారావు తెలిపారు. మైసమ్మలి, జైర్‌కోర్ట్, మల్లికార్జున భజన మండళ్లు తదితల మహిళలు తలంబ్రాలను తయారు చేశారు.

పోరాటాలతోనే వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం

రాష్ట్ర రైతు సంఘం మహాసభల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఖలీల్‌వాడి, మార్చి 25: రైతాంగ పోరాటాల ద్వారానే వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. రాష్ట్ర రైతు సంఘం 3వ మహాసభలు నిజామాబాద్ నగరంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ నుంచి పూలాంగ్ చౌరస్తా మీదుగా గోనెరెడ్డి ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పూలాంగ్ చౌరస్తాలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోనెరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందని, మూడు నల్ల చట్టాలను తెచ్చినా.. రైతుల పోరాటాల ఫలితంగానే అవి రద్దు చేయబడ్డాయని గుర్తు చేశారు. పసుపు బోర్డు తెస్తామని చెప్పి ఎంపీగా గెలిచిన అర్వింద్.. పసుపునకు మద్దతు ధర ఇవ్వలేక రైతులను మోసం చేస్తున్నారన్నారు. మరోపక్క రాష్ట్రంలో రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, రైతుభరోసా సరిగ్గా అందలేదన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో తీవ్రంగా పంట నష్టం జరిగిందని, రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోడీ ప్రభుత్వం చత్తీస్‌గడ్‌లో ఆదివాలసీ మీద యుద్ధం ప్రకటించి రాజ్యాంగాన్ని ఉల్లంఘించి దౌర్జన్యంగా పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు ఆలోచిస్తున్నారని, అందుకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈమేరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాసభలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నర్ర రామారావు తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నాయకులు ఓమయ్య, రాజిరెడ్డి, రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- **సమర్థవంతంగా నిర్వహించాలి - ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**
- **పూర్తి సహకారం అందిస్తాం.. - కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 25: ధాన్యం సేకరణ కోసం మహిళా స్వయం సహాయక సంఘాలకు కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించిన్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 670 కొనుగోలు కేంద్రాలకు గాను మహిళా సంఘాలకు రెండు వందలకు పైగా కేంద్రాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా సంఘాల ప్రతినిధులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మంగళవారం సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొని ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ .. కొనుగోలు కేంద్రాలను నిర్వహించే మహిళా సంఘాలకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ధాన్యం రవాణాకు లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, మెప్మా పీడీ రాజేందర్, డీసీవో శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ గంగవ్వ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

ఇందల్వాయి, మార్చి 25: మండలంలోని గన్నారం గ్రామ పంచాయతీలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు ఎంపీడీవో అనంతరావు మంగళవారం తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు జీవో నంబర్ 317 ద్వారా గన్నారం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతర జిల్లాలో విధులు నిర్వహించడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. మరో 70మంది ఇలాగే ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం వారిని సొంత మండలాల్లోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మంగళవారం నిర్వహించిన వెంకటేశ్వర్లు అంత్యక్రియలకు పలువురు తరలివెళ్లారు.

నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో మంగళవారం టెట్రానిక్స్ రోబోటిక్స్ ఎక్స్‌పో-2025 నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారని విద్యాసంస్థల చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి డీఈవో అశోక్ హాజరై ప్రాజెక్టులను తిలకించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తేజస్విని, రాజా, రామోజీరావు, నటరాజ్, శ్రీలత, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

- ఖలీల్‌వాడి/ కంఠేశ్వర్, మార్చి 25

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఇందల్వాయి, మార్చి 25: రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవొద్దని ఇందల్వాయి సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. సొసైటీ మహాజన సభను మంగళవారం నిర్వహించారు. సీఈవో రతన్ సొసైటీ జమాఖర్చులు చదివి వినిపించారు. సొసైటీ అభివృద్ధికి పాలకవర్గంతోపాటు సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మారుతి, డీసీసీబీ డైరెక్టర్ కోరట్‌పల్లి ఆనంద్, డైరెక్టర్లు మల్లారెడ్డి, రాజు, బాలవ్వ, గంగాధర్, రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రూ.4.58లక్షలకు కోటగిరి తైబజార్ వేలం

కోటగిరి, మార్చి 25: కోటగిరి తైబజార్ వేలాన్ని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పాతంగల్‌కు చెందిన వ్యాపారి రూ.4.58లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడని కార్యదర్శి బుజబుర్‌బేగ్ తెలిపారు. తైబజార్ గతేడాది రూ.4.31లక్షలు పలుకగా.. ఈసారి రూ.4.58లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

రూ.6.55లక్షలకు పాతంగల్ మేకల సంత..

పాతంగల్, మార్చి 25: పాతంగల్ తైబజార్‌కు స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం నిర్వహించగా.. మేకల సంతను రూ.ఆరు లక్షల 55వేలకు ఎల్లారెడ్డికి చెందిన హుస్సేన్ దక్కించుకున్నాడని మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో చందర్ తెలిపారు. రోజువారీ, వార సంతకు సరైన ధర రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. తిరిగి ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, కారోబార్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వేదనతో వృద్ధుడి ఆత్మహత్య

ధర్పల్లి, మార్చి 25: మానసిక వేదనతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని హోన్నాజీపేట్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ద్యాప పెద్ద నర్సయ్య(60) ఇల్లు నిర్మించేందుకు అప్పు చేశాడు. తన మూడో కుమార్తె ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమె వివాహం కాదేమోనని మానసిక వేదన చెందాడు. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కొమురవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

పొతంగల్, మార్చి 25: బాధిత కుటుంబాలకు సామాజిక సేవకర్త ఎంఏ హకీమ్ మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని జల్లాపల్లి అభాదికి చెందిన అబ్దుల్ రవూఫ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం కల్లూర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిలిన బీర్కూర్ గంగారాం కుటుంబ సభ్యులకు పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. జల్లాపల్లి, జల్లాపల్లి అభాదిలో 35 మంది పేద ముస్లిములకు రంజాన్ పండుగ సందర్భంగా బట్టలు పంపిణీ చేశారు. ఆయన వెంట షేరు, రాములు, దేవీసింగ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

ఖలీల్‌వాడి, మార్చి 25: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఎంటర్‌ప్రెస్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ ప్రాపర్టీ రైట్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం అండర్ ఎంఎస్ఎంఈ ఇన్వెటింగ్ స్కీమ్' అనే అంశంపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధి కోరుకునే స్థాయి నుండి ఉపాధి కల్పించే వారుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజేశ్‌కుమార్, రంజిత, వినయ్‌కుమార్, రజిత, సుమన్, సంతోష్, సతీశ్, ప్రియాంక, మౌనిక, సౌందర్య, గంగలత, శాంతిశ్రీ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సాయన్న

రుద్రూర్, మార్చి 25: సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్సై సాయన్న అన్నారు. వ్యాపారులు, గ్రామ పెద్దలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వ్యాపారులు సహకరిస్తే సీసీ కెమెరాల ఏర్పాటు సాధ్యమని చెప్పారు.

నేటి నుంచి రైల్వే గేట్ మూసి వేత

ఎడపల్లి, మార్చి 25: మండల కేంద్రంలోని నిజామాబాద్-బోధన్ ప్రధాన రాహదారిపై ఉన్న రైల్వే గేట్‌ను ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం నుంచి ఈనెల 28 తేదీ రాత్రి గంటల 10 వరకు మూసివేయనున్నట్లు రైల్వే శాఖ నిజామాబాద్ సీనియర్ సెక్షన్ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్-బోధన్ మార్గంలో నడిచే వాహనదారులు అంబం (వై), ఏఆర్‌పీ క్యాంప్, శాటాపూర్ గేట్ గ్రామాల గుండా వెళ్లాలని సూచించారు.

వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్,మార్చి25: పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా 32 మందికి జరిమానా విధించినట్లు ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ముగ్గురిపై డ్రంకన్‌డ్రైవ్ కేసు, నిబంధనలు పాటించని 32 మందికి జరిమానాలు విధించినట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

శక్కర్‌నగర్, మార్చి 25: బోధన్ పట్టణంలోని ద్యాకం గల్లీకి చెందిన గాండ్ల లక్ష్మి (60) అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఈనెల 23న లక్ష్మి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఆమె కుమారుడు సాయికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు మూడేండ్ల నుంచి మహిళకు మతిస్థిమితం సరిగా లేదు. మహిళ కనిపిస్తే 87126 59870, 87126 59778 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

అంబాపూర్‌కు చెందిన మహిళ..

మోర్తాడ్, మార్చి 25: మోర్తాడ్ తక్కూరి వాడలో ఉంటున్న రుద్రూర్ మండలం అంబాపూర్ గ్రామానికి చెందిన లలిత(40) ఈనెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త గిర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

సాటాపూర్ తైబజారు వేలం

రెంజల్, మార్చి 25: మండలంలోని సాటాపూర్‌లో మంగళవారం కూర గాయల వారం సంత వేలం మంగళవారం నిర్వహించారు. రూ.9లక్షల 43వేలకు మోహిన్ తైబజారును దక్కించుకున్నట్లు గ్రామ కార్యదర్శి మహిబూబ్ అలీ తెలిపారు. దడువాయి వేలంలో వ్యాపారులు ముందుకు రాక పోవడంతో వాయిదా వేసినట్లు కార్యదర్శి తెలిపారు.

వేలం వాయిదా

ఆర్మూర్‌టౌన్, మార్చి25: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజు అధ్యక్షతన మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, బుధవారం వేలం నిర్వహిస్తామని తెలిపారు.

బాల్కొండ మండలంలోని బస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విధులు నిర్వహించారు.
- బాల్కొండ, మార్చి 25

చదువులో వెనుకబడిన వారిపై శ్రద్ధ చూపాలి

రికార్డులు పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్ రూరల్, మార్చి 25: చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని అమ్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట హెచ్ఎం సూర్యకుమార్, ఉపాధ్యాయులు, ఉన్నారు.

చెట్టుకింద విగ్రహం లభ్యం

మాక్లూర్, మార్చి25: మండలంలోని డీకంపల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో మర్రిచెట్టు సమీపంలో మంగళవారం కొందరు గ్రామస్తులు మట్టి తవ్వుతుండగా సీతారామ, లక్ష్మణ సహిత విగ్రహం లభించింది. గ్రామపెద్ద మనుషులకు సమాచారం అందజేయగా విగ్రహాన్ని అక్కడే చెట్టు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసి పూజలు చేశారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవీపేట, మార్చి 25: నాశేశ్వర్‌కు చెందిన బుర్ర రాములు కుటుంబానికి మంజూరైన సీఎంఆర్ ఎఫ్ చెక్కును మంగళవారం బినోలా సొసైటీ చైర్మన్ మగ్గిరి హన్మాండ్లు అందజేశారు. గ్రామానికి చెందిన రాములు ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స చేయించుకున్నాడు. చెక్కు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

కారెపల్లి వీడీసీ ఎన్నిక

మోర్తాడ్, మార్చి25:భీమ్‌గల్ మండలం కారెపల్లి గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బదావత్ గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా మంగ్యానాయక్ ఎన్నికయ్యారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

వేల్పూర్, మార్చి 25: మండల కేంద్రలో 16వ విడుత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3 కోట్ల 50 లక్షలకు సంబంధించి నివేదికలు చదివి వినిపించారు. ఎండిపోయిన హరిత హారం మొక్కల స్థానంలో కొత్తవి నాటించాలని అధికారులు ఆదేశించారు. ఖాతా నంబర్ తప్పులతో ఆగిపోయిన కూలీల డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయగౌడ్, విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ, ఎంపీడీవో బాలకిషన్, ఏపీవో అశోక్, ఎస్ఆర్‌పీ సుశీల, బీఆర్‌పీలు, వీఎస్‌లు, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

దొడ్డు రకం ధాన్యానికీ బోనస్ ఇవ్వాలి

మోర్తాడ్‌లో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్

మోర్తాడ్/బోధన్ రూరల్, మార్చి 25: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన దొడ్డు రకం ధాన్యానికీ రూ.500 బోనస్ ఇవ్వాలని, ఐదెకరాలకు పైగా భూములు ఉన్న రైతులకు రైతుభరోసా ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. మోర్తాడ్ సొసైటీలో మహాజన సభ మంగళవారం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్ మాట్లాడుతూ.. రైతులం దరూ సొసైటీ అభివృద్ధికి సహకరించాలని, రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, ఉపాధ్యక్షుడు దడివె నవీన్, సభ్యులు బాల మల్లేశ్, ముత్యాల లక్ష్మణ్, మహిపాల్, భూమారెడ్డి, సాయన్న, అశోక్‌రెడ్డి, సత్తెమ్మ, భూమేశ్వర్, కార్యదర్శి కాశీరాం తదితరులు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను సొసైటీ చైర్మన్ గిర్దవర్ గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్ సొసైటీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను సభలో చదివి వినిపించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. రుణమాఫీ కాని రైతులకు మాఫీ అయ్యేలా కృషి చేయాలని, ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించాలంటూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ తిరుమల్లేశ్, సొసైటీ పాలక వర్గ సభ్యులు ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన పలువురికి జైలు శిక్ష

సిరికొండ/ ధర్పల్లి/ ఖలీల్‌వాడి(మోపాల్)/ వినాయక్‌నగర్/ నవీపేట, మార్చి 25: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురు వ్యక్తులకు ఆర్మూర్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సిరికొండ ఎస్సై ఎల్.రాము మంగళవారం తెలిపారు. పెద్దవడు గ్రామానికి చెందిన గొల్లపురం గంగారాం, వడ్డేటి రాజేందర్, తాళ్ల రామడ్గుకు చెందిన లింబాద్రి, రాజు, ధర్పల్లికి చెందిన భూక్యా శ్రీనివాస్, ఇందల్వాయికి చెందిన సంపత్, దుబ్బాకకు చెందిన కర్రోల్ల గోపికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. ధర్పల్లి మండలంలోని బీరప్ప తండాకు చెందిన దరావత్ రఘు ఈనెల 21న మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా.. మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. దీంతో మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. మోపాల్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా మోస్రా మండలం గోపూర్‌కు చెందిన బొద్దుల అర్జున్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడికి నిజామాబాద్ మార్నింగ్ కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని మోపాల్ ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నిజామాబాద్‌లోని వన్‌టౌన్ ఏరియాలో షేక్ జమీర్, మూడో టౌన్ పరిధిలో ములుగు రాజు, కోనేరు సాయిలు, ఆరో టౌన్ పరిధిలో మహ్మద్ హుస్సేన్, షేక్ అమీర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని నిజామాబాద్ మార్నింగ్ కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నవీపేటకు చెందిన ఆసాడి విజయ్‌కుమార్‌కు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలు శిక్ష, మరో నలుగురికి రూ. 2000 చొప్పున జరిమానా విధించినట్లు నవీపేట ఎస్సై వినయ్ తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం-** బాల్కొండ, మార్చి 25: మండల కేంద్రానికి చెందిన యెంగంటి ప్రవీణ్‌గౌడ్ జూనియర్ లెక్చరర్‌గ